ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.12.08.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై నిరాధార ఆరోపణలు చేశారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు లీగల్ నోటీసులు పంపారు.
2. ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.
3. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.
4. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది.

-------------------------

**BRS లీగల్ నోటీసులు:**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై చేసిన వ్యాఖ్యల విషయమై BRS కార్యనిర్వాహక అధ్యక్షులు K తారక రామారావు కేంద్ర మంత్రికి లీగల్ నోటీసు పంపారు. బండి సంజయ్ వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలనీ తన లీగల్ నోటీసులో ఆరోపించారు. ఈ నెల 8వ తేదీన కేంద్ర సహాయ మంత్రి విలేకర్ల సమావేశంలో ఫోన్ ట్యాపింగ్ పై ఆరోపణలు చేసిన విషయం తెల్సిందే. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజలలో తారక రామారావు ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తరఫు న్యాయవాదులు నోటీసులో పేర్కొన్నారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. నోటీసు అందిన ఏడు రోజుల్లోగా బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని, అలాగే, తారక రామారావు ఆయన కుటుంబ సభ్యులపై భవిష్యత్తులో దురుద్దేశపూర్వకంగా ఎలాంటి ఆరోపణలూ చేయరాదని డిమాండు చేశారు.

**(MSL)**

-------------------

ఎరువులు-మంత్రి అడ్లూరి

ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు సరిపడా యూరియాను ప్రభుత్వం అందిస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి వ్యవసాయ, సహకార, నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులకు యూరియా కొరత రాకుండా అన్ని చర్యలు తీసుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు సుమారు 21 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సొసైటీల ద్వారా రైతులకు అందించామని, మరో 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా గోదాముల్లో నిల్వ ఉందని తెలిపారు.

**(పీటీసీ, జగిత్యాల)**

---------------------

**కవ్వాల్ టైగర్ రిజర్వు**

మంచిర్యాల జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్ మీదుగా భారీ వాహనాల రాకపోకలపై విధించిన ఆంక్షలను ప్రభుత్వం ఎత్తివేసిందని జిల్లా డీఎఫ్ఓ శివ్ ఆశిష్ సింగ్ తెలిపారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లో జరిగిన వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. కన్వాల్ టైగర్ జోన్ లో వాహనాలకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే ప్రవేశం ఉంటుందని, రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎలాంటి అనుమతి ఉండదని వెల్లడించారు. చెక్ పోస్టుల వద్ద రవాణా వాహనాలకు మాత్రమే 150 రూపాయల ఎంట్రీ ఫీజు వసూలు చేస్తారని తెలిపారు.

**(మంచిర్యాల, పీటీసీ)**

--------------------------

**సంగారెడ్డి పరిశ్రమల తనిఖీలు**

సంగారెడ్డిలోని సిగాచి పరిశ్రమ ప్రమాదంలో 54 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక, కార్మిక, బాయిలర్స్ విభాగాల నుంచి ఏడుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం మొదటగా సంగారెడ్డి జిల్లాలోని హై రిస్క్ పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టనుంది.

**(పీటీసీ, సంగారెడ్డి)**

------------------------

**వరంగల్-ఇందిరమ్మ ఇళ్లు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. నిన్న ఆయన హన్మకొండలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టే ఓటీపీ, జియో ట్యాగింగ్ నమోదు నెమ్మదిగా ఉందని, దీన్ని వేగవంతం చేయాలన్నారు. ఇల్లు మంజూరై ఇప్పటివరకు నిర్మాణం మొదలుపెట్టని వారికి నోటీసులు ఇచ్చి పనులు ప్రారంభించేలా చూడాలని, ఆగస్టు 15 లోగా కొత్త ఇళ్లకు మార్కింగ్ ఇవ్వాలని సూచించారు.

**(వరంగల్ - పీటీ సీ)**

-----------------------

**జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్**

దళితుల భూముల ఆక్రమణలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్ చందర్ సూచించారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ, దళితులపై అన్యాయం జరిగితే కమిషన్ తక్షణ న్యాయం అందిస్తుందన్నారు. జిల్లా నుంచి భూవివాదాలపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

----------------------------

**బీజేపీ -అరెస్టులు**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు సహా పలువురు పార్టీ నేతలను ఈ ఉదయం గృహ నిర్బంధం చేయడాన్ని ఆ పార్టీ ఖండించింది. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని పెదమ్మ గుడికి సంబంధించి కొన్ని సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు తనను గృహనిర్బంధం చేశారని రామచంద్ర రావు మీడియాకు వెల్లడించారు. ఆ కార్యక్రమాలతో బీజేపీకి సంబంధం లేకపోయినా తనను అరెస్ట్ చేయడం, తమ పార్టీ కార్యక్రమాలను అడ్డుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుచిత విధానాలకు ఇది నిదర్శనమని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఒక వర్గం ఓటర్లను మెప్పించేందుకే మరో వర్గం మనోభావాలను దెబ్బతీస్తున్నారని మంత్రి ఆరోపించారు.

**(Desk)**

--------------------

సిరిసిల్ల-షెడ్యూల్ బైట్

రైతులకు పంట పెట్టుబడుల కోసం ఉద్దేశించిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం తనకు ఎంతో ఉపయోగపడుతోందని రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన రైతు, లబ్దిదారు బందేల వెంకటేష్ ఆకాశవాణితో తెలిపారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-------------------------

జలాశయాలు

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలకు భారీగా వరద నీరు పెద్దఎత్తున వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం కారణంగా శ్రీశైలం జలాశయం నాలుగు గేట్లను అధికారులు పది అడుగుల మేర ఎత్తారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు 2లక్షల 10వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా 1లక్ష 73వేల క్యూసెక్కుల నీళ్లు బయటకు వెళ్తున్నాయి. కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. మరోవైపు జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 1045 అడుగులు కాగా ప్రస్తుతం 1043.27 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. శ్రీరామసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా, ప్రస్తుతం 1080 అడుగుల వద్ద 44.94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కడెం పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా.. ప్రస్తుతం 696.88 అడుగుల వద్ద 3.94 టీఎంసీలు నిల్వ ఉంది.

-----------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ రోజు ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పసుపు రంగు హెచ్చరికా జారీ చేసింది. రేపు భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, పెద్దపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది.

**(డెస్క్)**

--------------------------

**మూసీ**

మరోవైపు హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మూసీ నదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అంబర్‌పేటలోని మూసారాంబాగ్ వద్ద బ్రిడ్జిని ఆనుకుని వరద

ప్రవాహం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. అధికారులు అప్రమత్తమై మూసారాంబాగ్ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. హుస్సేన్‌సాగర్ లో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువలో ఉంది.

**డెస్క్**

---------------------

**గ్రేటర్ వరంగల్-వర్షాలు**

నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి లోతట్టు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పర్యటించి. పరిస్థితిని సమీక్షించారు.

**(పీటీసీ, వరంగల్)**

-------------------------

వర్షాలు-యాదాద్రి

యాదాద్రి భువనగిరి జిల్లాలో గత 24 గంటలుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

**(పీటీసీ, యాదాద్రి)**

--------------------

సంగారెడ్డి –వర్షాలు

సంగారెడ్డి జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జహీరాబాద్, జరసంఘం మండలాల్లో రోడ్లపైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**(పీటీసీ, సంగారెడ్డి)**

---------------------------

**CLOSING**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.

---------------------------